క్లుప్తంగా

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

పోలవరం రూరల్ : వలంటీర్లు వారి పరిధిలో కష్టపడి పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని ఎంపీపీ సుంకర వెంకట రెడ్డి అన్నారు. తల్లవరం గ్రామానికి చెందిన వలంటీర్లకు బుధవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు వలంటీర్లు కృషి చేయాలన్నారు. ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, ఎంపీటీసీ హేమల శ్రీదేవి, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే ఖాన్ ఉన్నారు.

కన్నాయిగూడెంలో తాగునీరు కలుషితం



కన్నాయిగూడెంలో తాగునీటి పరిస్థితి

కొయ్యలగూడెం : పొంగుటూరు పంచాయతీ పరిధిలోని కన్నాయిగూడెంలో కలుషిత తాగునీరు సరఫరా అవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా కుళాయిల వెంట తాగునీరు కలుషితం అయ్యిందని గత రెండు రోజుల నుంచి మళ్లీ కలుషితమైన తాగునీరు సరఫరా అవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పండుగ సమయాలలో వచ్చిన బంధుమిత్రులకు రక్షిత తాగునీరు సరఫరా చేయలేక ఆర్వో ప్లాంట్ల ద్వారా తాగునీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. వాడకానికి కూడా ఈ నీరు పనికి వచ్చే విధంగా లేదని వాపోయారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

లక్కవరంలో రెండు ఎద్దులు మృతి



మృతి చెందిన ఎద్దులు

జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరం ఎర్ర కాలువ ప్రధాన కాలువలో రెండు ఎద్దులు మునిగి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. లక్కవరానికి చెందిన బొప్పనేటి లక్ష్మీనారాయణ అనే రైతు తన ఎడ్లపై వరి నారు వేసుకుని పొలం వెళ్లే క్రమంలో ఈ ప్రమాదంలో చోటు చేసుకుంది. ఎద్దులు కాలువ దాటే ప్రయత్నం చేయడంతో ఒక్కసారిగా మునిగిపోయాయి. ఎద్దులు కాలువలోకి వెళ్లిన సమయంలో రైతు లక్ష్మీనారాయణ కాలువ గట్టుపై ఉండటంతో అతనికి ప్రమాదం తప్పింది. రైతు కళ్లెదుటే ఎద్దులు నీటిలో మునిగిపోయి మృతి చెందాయి. మృతి చెందిన ఎద్దులు విలువ రూ.1,50,000 ఉంటుందని రైతు తెలిపారు.

ముగిసిన సప్తాహాలు



ఉత్సవ పూర్ణాహుతిలో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అర్చకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గత డిసెంబర్ 29 నుంచి ప్రారంభమైన స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. మూడు వారాల పాటు ఆలయంలో స్వామి వారికి నిత్య కల్యాణాలు, విశేష అలంకరణలు, లక్ష తులసి, లక్ష కుంకుమార్చనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నిత్యం సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారికి ఉదయం సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి, శ్రీ విష్ణు సహస్రనామార్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాదా వినియోగం చేశారు. స్వామి వారికి శ్రీచక్ర స్నాన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ పూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా జరిగింది. సాయంత్రం 5 గంటలకు నగరానికి చెందిన వేదుల జయలక్ష్మి, గుడిపాటి శిరీష నిర్వహించిన భక్తి సంగీత కచేరి భక్తులకు వీనుల విందు చేసింది. రాత్రి 7 గంటల నుంచి స్వామి వారికి దర్బారు సేవ చేశారు. అనంతరం శ్రీవారి పవళింపు సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి ఆండ్ర రవిశంకర్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- దొరమామిడి సచివాలయం–2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం



దుద్దుకూరులో ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం : గిరిజనుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దొరమామిడి సచివాలయం–2 పరిధిలోని దుద్దుకూరు, గొల్లగూడెం, కొమరవరం గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల కొండ ప్రాంతంలో ఉన్న గిరిజనులకు సైతం ప్రభుత్వ పథకాలు అందే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా గిరిజన పిల్లల విద్యాభివృద్ధికి, మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. దేశానికే ఆదర్శంగా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన చేస్తుంటే ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా ఉత్తమ సేవలు అందిస్తున్న వలంటీర్‌లపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు తీరు మార్చుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, సర్పంచ్‌లు తెల్లం రాముడు, జోడే సత్యదుర్గాప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీహరి, కార్యదర్శి బుజ్జమ్మ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ అలీ, ఏఓ బి.సుమలత, వెలుగు ఏపీఎం పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు చింతలపూడి వెంకటనారాయణ, సోయం వెంకట్రావు, పూనెం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈబీ అధికారుల దాడులు



దాడుల్లో పట్టుబడ్డ నాటు సారాతో అధికారులు

చింతలపూడి : చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో బుధవారం ఎస్‌ఈబీ అధికారులు చింతలపూడి, లింగపాలెం మండలాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బాణావతు శ్రావణి అనే మహిళను అరెస్ట్ చేసి 15 లీటర్ల సారా, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. లింగపాలెం మండలం పుప్పాలవారిగూడెం గ్రామంలో నిట్టా ఎలీషా అనే మహిళ నుంచి 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఈబీ సీఐ సాయిస్వరూప్ తెలిపారు.

ఉపాధి హామీ సొమ్ము రికవరీ చేయాలి

డ్వామా పీడీ రాంబాబు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ

పోలవరం రూరల్ : ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి పోలవరం మండలం పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశంలో రూ.లక్షా 15వేల 842 రికవరీ చేయాల్సిందిగా డ్వామా పీడీ డి.రాంబాబు ఆదేశించారు. గ్రామాల్లో 2021–2122 సంవత్సరాల్లో చేపట్టిన పనులకు వారం రోజులు తనిఖీ చేసి సిబ్బంది ఈ నివేదిక ఇచ్చినట్లు ఆయన చెప్పారు. అధికారులు కార్యాలయాలు వదిలి గ్రామాల్లో పనులు పరిశీలిస్తే అసలు విషయాలు తెలుస్తాయన్నారు. రెండు సంవత్సరాల్లో వేతనాల రూపంలో రూ.13కోట్ల 22 లక్షలు చెల్లించగా 4 కోట్ల 68లక్షల పనులు జరిగాయన్నారు. సిబ్బంది చేసిన వివిధ తప్పిదాల వల్ల రూ. 9 వేలు జరిమానా విధించామన్నారు. వివిధ భవనాల నిర్మాణాల రీత్యా డ్రా చేసిన బిల్లులు 15 రోజుల్లో నిర్మాణాలు ప్రారంభించకపోతే ఆ నిధులు రికవరీ చేయాలన్నారు. పర్యవేక్షణా లోపభూయిష్టంగా ఉందన్నారు. చనిపోయిన వారి పేర్ల మీద మస్తర్లు వేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పనికి వెళ్లకపోయినా చిరుద్యోగుల పేర్లు నమోదు చేయడంపై మండిపడ్డారు. ఇలాంటి తప్పిదాలు మరలా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస బాబును ఆదేశించారు. ఉపాధి పనులపై ఎంతో మంది ఆధారపడి ఉన్నారని వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రతి కుటుంబానికి పని కల్పించడమే కాకుండా జాబ్‌కార్డులు కూడా మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో పి.వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో చేపల పెంపకం ద్వారా లాభాలు

డీఆర్‌డీఏ పీడీ కె.విజయరాజు



మేడిశెట్టివారిపాలెంలో చేపల పెంపకం ప్రాజెక్టును పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ విజయరాజు

చింతలపూడి : ఆధునిక పద్ధతుల్లో చేపల పెంపకం ద్వారా అధిక లాభాలను ఆర్జించవచ్చునని డీఆర్‌డీఏ పీడీ కె.విజయరాజు అన్నారు. మండలంలోని చింతంపల్లి పంచాయతీ, మేడిశెట్టివారిపాలెం గ్రామంలో తొలిసారిగా ఆర్ఏఎస్ పద్ధతిలో చేపల పెంపకాన్ని చేపట్టిన ప్రాజెక్టును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాండ్ర రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ విజయరాజు మాట్లాడారు. తక్కువ స్థలంలో తక్కువ నీటితో అతి తక్కువ మంది కూలీలతో చేపల పెంపకాన్ని ఈ పద్ధతిలో సాగు చేయవచ్చునని ఆయన తెలిపారు. కేవలం బోరు నీటితోనే చేపల పెంపకం చేపట్టవచ్చునన్నారు. దీనికి ప్రభుత్వం కూడా సహకారం అందిస్తుందన్నారు. ఐఆర్‌డిఓ, సేవా ఎన్‌జీఓల సహకారంతో గ్రామంలో యు సత్యవతి అనే మహిళా రైతు చేపట్టిన చేపల పెంపకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామకృష్ణారావు మాట్లాడుతూ సీతానగరం యూనియన్ అందించిన రూ.1.5 లక్షల రుణంతో పాటు ఐఆర్‌డిఓ మరో రూ.50 వేలు గ్రాంట్ క్రింద విడుదల చేసినట్లు చెప్పారు. గ్రామ పంచాయతీలో చేపల పెంపకంపై ఆసక్తి ఉన్న యువతను, మహిళలను గుర్తించి డీఆర్‌డీఏ సహకారంతో మరిన్ని యూనిట్లు నెలకొల్పనున్నట్లు చెప్పారు. ఐఆర్‌డీఓ బై బ్యాక్ పద్ధతిలో రైతులు సాగు చేసిన చేపలను మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంతో ఈ ప్రాంతంలో మరిన్ని చేపల పెంపకం యూనిట్లు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. మహిళలు చేపల పెంపకాన్ని జీవనోపాధిగా మలుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి.భానుతేజ, సేవ ఎన్‌జీఓ ప్రతినిధి యు.రాజారావు, ఐఆర్‌డీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీపీఐ పోరుబాట వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కొయ్యలగూడెం సీపీఐ కార్యాలయంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : సీపీఐ పోరుబాట కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బుధవారం సీపీఐ నాయకులు ఏఐటీయూసీ నాయకులతో కలిసి సీపీఐ పోరుబాటకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 23, 24 తేదీలలో రెవెన్యూ డివిజనల్ పరిధిలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. బీజేపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నిర్వహించే ఆందోళన, దీక్ష కార్యక్రమాల్లో అఖిలపక్షాల నాయకులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే బాజీ, ఏఐటీయూసీ నాయకులు వెలగల రామారావు, ఎస్ గిరి తదితరులు పాల్గొన్నారు.

21నుంచి ఆటల పోటీలు ప్రారంభం



ఆటల పోటీలకు సంబంధించిన పోస్టర్‌లను విడుదల చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : ఈ నెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ టీబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 4వ సీజన్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆటల పోటీలకు సంబంధించిన పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ సరియం చల్లయ్య మాట్లాడుతూ కబడ్డీ, వాలీబాల్, విలువిద్యలో నాటు బాణంతో పాటు మోడ్రన్ బాణం పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాలీబాల్, కబడ్డీ విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గో బహుమతులుగా రూ.25 వేలు, రూ.15 వేలు, 10 వేలు, రూ.5 వేలు అందిస్తారన్నారు. అదేవిధంగా విలువిద్య విభాగంలో నాటు బాణం, ఆధునిక బాణంలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున అందిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి ఎంట్రన్స్ ఫీజు కట్టాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, నాయకులు కారం రమణ, తెల్లం దేవరాజు, కుక్కల గోపి, కోరం దుర్గారావు, దినేష్, రాజు, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గుండుగొలనులో చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సచివాలయ కన్వీనర్ గొటికల మురళి

భీమడోలు: పోషక విలువలు గల సమతుల ఆహారం భుజించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని గుండుగొలను సచివాలయ కన్వీనర్ గొటికల మురళి అన్నారు. భీమడోలు మండలం గుండుగొలను అంగన్‌వాడీ కేంద్రం 23లో అంగన్‌వాడీ కార్యకర్త బి.రాజమణి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మురళి చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, కిషోర్‌బాలికలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం వరమని మురళి అన్నారు. మునుపెన్నడూ లేని విధంగా లబ్ధిదారులకు అధిక పోషక విలువలు గల ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పెద్దలు, మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తెల్లారినా.. వీడని మంచు



ధర్మాజీగూడెం నుంచి చింతలపూడి వెళ్లే రోడ్డులో మంచు కమ్మిన దృశ్యాలు



లింగపాలెం మండలంలో బుధవారం ఉదయం తొమ్మిది గంటలైనా మంచు వీడలేదు. ప్రధాన రహదారుల్లో మంచు కమ్మేయడంతో దారి కనబడక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మంచుతో పాటు చలికూడా విపరీతంగా ఉండటంతో ప్రజలు బారెడు పొద్దెక్కినా ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. ఈ మంచు వల్ల మామిడి, జీడిమామిడి తోటల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– లింగపాలెం

హేలాపురి బ్రాహ్మణ యువజన సంఘం సమావేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హేలాపురి బ్రాహ్మణ యువజన సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. స్థానిక రామచంద్రరావుపేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో నిర్వహించిన ఈ సమావేశంలో సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ యువజన అభివృద్ధికి చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

మెట్టినింటికి చేరిన చింతాలమ్మ



విశేషాలంకరణలో దర్శనమిస్తున్న చింతాలమ్మ అమ్మవారు

కొయ్యలగూడెం : సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఐదు రోజులపాటు విశేష పూజలు అందుకున్న కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారు బుధవారం మెట్టినింటికి చేరుకుంది. సంప్రదాయం ప్రకారం పెద్ద పండుగ నాడు ఆడపడుచులు పుట్టింటికి వచ్చినట్లే అంకాల చెరువు గట్టుపై మెట్టినింట్లో(ఆలయం) కొలువైన చింతాలమ్మ అమ్మవారిని గ్రామంలోని నడిబొడ్డున ఉన్న పుట్టినింటికి (ఆలయం) తోడ్కొని వచ్చారు. ఈసందర్భంగా అధిక సంఖ్యలో మహిళా భక్తులచే నిత్య నీరాజనాలు, పూజలు అందుకున్న అమ్మవారిని అనంతరం సంప్రదాయ బద్ధంగా గ్రామస్తులు మెట్టినింటికి సాగనంపారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి రజక సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని వినతి



సచివాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ

కుక్కునూరు : మండలంలోని నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఐ కుక్కునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో సచివాలయాలలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, సహాయ కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య మాట్లాడుతూ మండలాన్ని యూనిట్‌గా భూసేకరణ చేయాలని , ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, నిర్వాసితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, గోదావరి వరదలకు కూలిన ఇళ్లకు ప్రకటించిన నష్టపరిహారం రూ.10 వేలు బాధితుల ఖాతాలలో జమచేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యురాలు వరకా శ్యామల, మడిపల్లి రమణయ్య, పల్లెల భిక్షం, బాబురావు, సంగెపు పెంటయ్య, ఉంగా రాజు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ సత్తిపండు విగ్రహావిష్కరణ



గౌడ కమ్యూనిటీ హాలులో తల్లాడ సత్తిపండు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : స్థానిక గౌడ సంఘం భవనంలో దివంగత నేత, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ తల్లాడ సత్తిపండు విగ్రహాన్ని కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు కొప్పుల వీరగంగరాజు ఆవిష్కరించారు. తల్లాడి సత్తిపండు పట్టణానికే కాకుండా కల్లుగీత కార్మికులకు కూడా ఎన్నో సేవలందించారని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెట్టి గురునాధరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, జెడ్పీటీసీ పొల్నాటి బాబ్జి, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సారా, మాదక ద్రవ్యాలను అరికట్టాలి



దొరసానిపాడులో సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఈబీ సీఐ సుబ్రహ్మణ్యం

ద్వారకాతిరుమల : భావితరాలు సన్మార్గంలో నడవాలంటే సారా, మాదక ద్రవ్యాలను అరికట్టాలని ఎస్‌ఈబీ సీఐ ఏయూబీ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని దొరసానిపాడులో ఆపరేషన్ పరివర్తన పేరుతో సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ సుబ్రహ్మణ్యం మాదక ద్రవ్యాలు, నాటుసారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కళాజాత ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ సారా కాయడం, క్రయ విక్రయాలు జరపడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారికి సహకరించిన వారు సైతం శిక్షార్హులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈబీ సిబ్బంది సీతారాం, సత్యంబాబు, దొరసానిపాడు, సీహెచ్ పోతేపల్లి మహిళా పోలీసులు టి.కమలకుమారి, మౌనిక తదితరులున్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం



విద్యార్థులతో ఫాదర్లు ఆదాం, ఆనంద్‌బాబు

లింగపాలెం : హోప్ సోషల్ సర్వీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొణిజర్ల, తోచలక రాయుడుపాలెం, మఠంగూడెం, సుందరాజుపేట, భోగోలు, ధర్మాజీగూడెం, కాటమరెడ్డిపల్లి గ్రామాలలోని తల్లిదండ్రులు లేని 64 మంది పేద విద్యార్థులకు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఫాదర్ ఆదాం, ధర్మాజీగూడెం ఆర్‌సీయం విచారణ కర్త ఫాదర్ జి.ఆనంద్‌బాబు మాట్లాడుతూ హోప్ సంస్థను గ్రామాల్లోని అనేక మంది విద్యార్థినీ, విద్యార్థులు, దాతలు కలసి స్థాపించినట్లు తెలిపారు. పేదలను ఆర్థికంగా ఆదుకోవాలన్నదే హోప్ సంస్థ ఉద్దేశం అన్నారు.

ఆ స్కాలర్ షిప్‌ను పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): మౌలానా అజాద్ నేషనల్ ఫెలోషిప్ స్కాలర్ షిప్‌ను కేంద్రం రద్దు చేయడం తగదని దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజేంద్ర సచార్ కమిటీ మైనార్టీల స్థితిగతులపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి చేసిన సిఫార్సుల మేరకు నాటి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్కాలర్ షిప్ ముస్లింలు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత రంగాల్లో ప్రవేశించేందుకు ఎంతగానో దోహదపడిందని తెలిపారు. ఈ పథకాన్ని తిరిగి ప్రారంభించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై త్వరలో రాష్ట్ర గవర్నర్‌కు వినతి పత్రం అందజేయనున్నట్లు ప్రకటించారు.